సాక్షి బాపట్ల

సోమవారం ׀ 8 ׀ జనవరి ׀ 2024



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

భట్టిప్రోలు: పెదపులివర్రులో నూతనంగా పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



దుర్గమ్మ సేవలో చాగంటి..

విజయవాడ పశ్చిమ: దుర్గమ్మను ప్రముఖ ప్రవచకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఈవో కేఎస్ రామారావు, ఈఈ కోటేశ్వరరావు స్వాగతం పలికారు.

బండ్లమ్మకి ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని శ్రీ బగళాముఖ బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించారు. వసువు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

పండగలోపే సిరిహారం

" మీ బిడ్డ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ నష్టం, ఇబ్బంది జరగదు. తుఫాను వల్ల జరిగిన నష్టం అపారం. సాయం పారదర్శకంగా, వేగంగా అందుతుంది. గత ప్రభుత్వాలకంటే మిన్నగా జరుగుతుంది. మీ చేయిపట్టి తీసుకెళ్లి న్యాయం చేసే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ మనది. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు."

(డిసెంబర్ 8న జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మిచాంగ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్ని పరిశీలించిన అనంతరం బాధిత రైతులకు ఇచ్చిన భరోసా ఇది)

- మిచాంగ్ తుఫాను ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం
- 63,301 హెక్టార్లలో దెబ్బతిన్న అగ్రి, హార్టీకల్చర్ పంటలు
- నష్టపోయిన 92,220 మంది రైతులు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- సంక్రాంతి లోపే పరిహారం ఇస్తామన్న ముఖ్యమంత్రి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ముఖ్యమంత్రి మాట ఇచ్చిన మరుక్షణమే తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించే కార్యక్రమానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన శ్రీకారం చుట్టింది. తక్షణమే నష్టం వివరాల్ని రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఒక్కరికీ అన్యాయం జరగకుండా ఇన్‌పుట్ సబ్సిడీకి అర్హులైన రైతుల వివరాల్ని శరవేగంగా సిద్ధం చేశారు. వాటిని డిసెంబర్ 28 వరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనగా ఉంచారు. సవరించిన జాబితాను వారం కిందటే ప్రభుత్వానికి పంపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే రైతులకు తుఫాను పరిహారం అందనుంది. నష్టం జరిగిన నెలలోపే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కొనియాడుతున్నారు.



నష్టపోయిన ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

అగ్రికల్చర్ పరిధిలో నష్టం ఇలా ..

- జిల్లాలోని 25 మండలాల్లో వరి పంట సాగైంది.
- మిచాంగ్ తుఫాను ప్రభావంతో అమృతలూరు, బాపట్ల, భట్టిప్రోలు, చెరుకుపల్లి, కారంచేడు, కర్లపాలెం, కొల్లూరు, నగరం, పర్చూరు, నిజాంపట్నం, రేపల్లె, పిట్టలవానిపాలెం, వేమూరు, చుండూరు మండలాల్లో పంట పూర్తిగా దెబ్బతింది.
- ఒక్కో మండలంలో 4 నుంచి 6 వేల హెక్టార్ల వరకు నష్టం జరిగింది.
- ఈ లెక్కన 25 మండలాల పరిధిలో 81,965 మంది రైతులకు చెందిన 57,984 హెక్టార్లలో దెబ్బతింది. దీంతో రూ.90,96,45,775 రూపాయల నష్టం వాటిల్లినట్లు అధికారులు లెక్క తేల్చారు.

ఉద్యాన పంటల నష్టం ఇలా..

- తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మిర్చి, అరటి, బొప్పాయి, కూరగాయలు తదితర ఉద్యాన పంటలకు పెద్దఎత్తున నష్టం వాటిల్లింది.

జిల్లాలో రూ. 101.40 కోట్ల నష్టం

మిచాంగ్ తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా అగ్రికల్చర్, హార్టీకల్చర్‌కు సంబంధించి 63,301 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. 92,220 మంది రైతులకు రూ.101.40 కోట్ల మేర నష్టం వాటిల్లింది.



దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

- మొత్తం 18 మండలాల పరిధిలో 5,986 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి.
- ప్రధానంగా కారంచేడు మండలంలో 1595 హెక్టార్లు, పర్చూరులో 1136, యద్దనపూడిలో 506, కొరిశపాడులో 426, జె.పంగులూరులో 412, చినగంజాంలో 288, కర్లపాలెంలో 204, భట్టిప్రోలు, 92, కొల్లూరు 284 హెక్టార్ల చొప్పున నష్టం వాటిల్లింది.
- మొత్తం 10,255 మంది రైతులు రూ. 10,44,24,093 నష్టపోయారు.

గత ప్రభుత్వ హయాంలో పరిహారం హుళక్కి

గత ప్రభుత్వంలో తుఫాను ఇతరత్రా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం జరిగినా సంవత్సరాల తరువాత కూడా పరిహారం అందించిన పాపాన పోలేదు. అదికూడా సక్రమంగా ఇచ్చిన పరిస్థితి లేదు. పారదర్శకంగా ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. చంద్రబాబు ప్రభుత్వం వారి గోడు పట్టించుకోలేదు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక



మిచాంగ్ తుఫాను వల్ల జిల్లావ్యాప్తంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుంది. తుఫాను వల్ల దెబ్బతిన్న పంటల్ని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించిన విషయం తెలిసిందే. బాధిత రైతుల్ని ఆదుకోవాలని, ఈ మేరకు వెంటనే నష్టం నివేదికల్ని అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి దెబ్బతిన్న పంటల వివరాల్ని ఇటీవలే ప్రభుత్వానికి నివేదించాం. రూ. 101 కోట్లకు పైగా ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే ప్రభుత్వం పరిహారం విడుదల చేసి రైతుల్ని ఆదుకుంటుంది.

– రంజిత్ బాషా, కలెక్టర్, బాపట్ల జిల్లా

యుద్ధప్రాతిపదికన ఇన్‌పుట్ సబ్సిడీ



మిచాంగ్ తుఫాను వల్ల జిల్లాలో అగ్రికల్చర్, హార్టీకల్చర్‌లకు సంబంధించి 63,301 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. 92,220 మంది రైతులకు రూ.101 కోట్లకు పైగా నష్టం జరిగింది. గ్రామస్థాయిలో పంటనష్టం అంచనాల్ని రూపొందించి ఆ వివరాల్ని డిసెంబర్ 28 వరకు ఆర్బీకేలలో రైతులకు అందుబాటులో ఉంచాం. ఆ తరువాత వారం కిందట ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ప్రభుత్వం తుఫాను బాధితులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించనుంది.

– అబ్దుల్ సత్తార్, జిల్లా వ్యవసాయాధికారి, బాపట్ల జిల్లా

పుస్తకం.. శాశ్వతబంధం

- ప్రముఖ సినీనటుడు తనికెళ్ల భరణి
- ముగిసిన విజయవాడ పుస్తక మహోత్సవం



స్టాల్లో బుక్స్‌ను పరిశీలిస్తున్న పుస్తక ప్రియులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పుస్తకాలతో స్నేహం చేయడం అంటే ఆనందాన్నిచ్చే శాశ్వత బంధం వంటిదని కవి, రచయిత, నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 34వ విజయవాడ పుస్తకమహోత్సవం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు సభకు తనికెళ్ల భరణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఆనందదాయకం

గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే మాట్లాడుతూ పుస్తకాలను జీవితంలో భాగం చేసుకోవాలని చెప్పారు. మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ పుస్తకాలు తన జీవితంలోని ప్రతి దశలోనూ అభివృద్ధికి, ఆనందానికి కారణమయ్యాయని చెప్పారు. విజయవాడ పుస్తక మహోత్సవం సంఘం అధ్యక్షుడు మనోహర్ నాయుడు మాట్లాడుతూ పుస్తక మహోత్సవాన్ని ఆదరించిన ప్రజలకు, పుస్తక ప్రియులకు ధన్యవాదాలు తెలిపారు. పుస్తక మహోత్సవంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు అతిథులు బహుమతులను అందించారు. పుస్తక మహోత్సవ సంఘం గౌరవ అధ్యక్షుడు బెల్లపు బాబ్జీ, కార్యదర్శి కె.లక్ష్మయ్య, సభ్యుడు గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ఎమెస్కో సంస్థ అధినేత విజయకుమార్ సభకు అధ్యక్షత వహించారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

నరసరావుపేట: భారత ఎన్నికల సంఘం అధికారుల పర్యటన దృష్టిలో పెట్టుకొని కలెక్టరేట్‌లో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఓటు హక్కు వినియోగం తప్పనిసరి: కలెక్టర్



విజయపురి సౌత్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ లోతోటి శివశంకర్ తెలిపారు. మాచర్ల మండలంలోని బీకే పాలెం చెంచు కాలనీ, బోధనంపాడు చెంచు కాలనీల్లో ఆదివారం పర్యటించారు. ఓటు హక్కుపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఓటు వేయడం బాధ్యతని తెలిపారు. ప్రతి గడపకూ వెళ్లి చెంచులకు అందుతున్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యల్ని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జి.వి.రమణాకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు స్వామి, మాచర్ల తహసీల్దార్ షేక్ మహమ్మద్ హుస్సేన్, డీఎల్ డీవో గభ్యనాయక్, ఎంపీడీవో సరోజినీదేవి, రూరల్ ఆర్‌ఐ ఫణీంద్రకుమార్, ఎలక్షన్ సెల్ డెప్యూటీ తహసీల్దార్ బాషా, బీఎల్‌వో ఎం. శ్రీనివాసరావు, నాగులవరం వీఆర్వో అంజి పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ టీ-20 క్రికెట్ పోటీలు



జే.పంగులూరు: కొండమంజులూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు గ్రామంలో పానెం హనిమిరెడ్డీస్ కొండమంజులూరు ప్రీమియర్ లీగ్ దేశ స్థాయిలో టీ-20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి మాట్లాడుతూ 29 ఏళ్ల నుంచి దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు మొదట్లో రూ.1000 నుంచి ప్రస్తుతం రూ.6 లక్షల వరకు బహుమతులు ఇచ్చేస్థాయికి వచ్చినట్లు వివరించారు. దేశంలో ఐపీఎల్ తర్వాత అతి పెద్ద క్రికెట్ పోటీలు సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్, రంజీస్థాయి ఆటగాళ్లతో కూడిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీలను వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.6 లక్షలు హనిమిరెడ్డి అందిస్తున్నట్లు తెలిపారు. రెండో బహుమతి రూ.4 లక్షలు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ బీవీ కృష్ణారెడ్డి, మూడో బహుమతి రూ.2 లక్షలు తాను అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం షెడ్యూల్ మ్యాచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రికెట్ క్లబ్ కమిటీ సభ్యులు వెంకన్నబాబు, వేణుబాబు, రాజాబాబు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వీరాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మంగళవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా నిర్వహిస్తామని ఈవో కె.ఎస్. రామారావు పేర్కొన్నారు. భవానీ దీక్ష విరమణలను పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆర్జిత సేవల టికెట్ల విక్రయాలను దేవస్థానం నిలిపివేసింది. ఆదివారంతో దీక్ష విరమణలు పూర్తి కావడంతో మంగళవారం నుంచి ఉభయదాతలను సేవలకు అనుమతించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్ల విక్రయాలు కొనసాగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

సాగర్ నీటి మట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 829.00 అడుగుల వద్ద ఉంది.

రేపటి నుంచి అంతరాష్ట్ర క్రికెట్ పోటీలు

- పలు రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 16 జట్లు
- ఎనిమిది రోజుల పాటు క్రికెట్ అభిమానులకు పండుగ

మేదరమెట్ల: సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీల సంబరం మొదలైంది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో ఈనెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30వ అంతరాష్ట్ర టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభించనున్నట్లు అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు. రావినూతల క్రికెట్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోటీల్ని టీ-20 ఫార్మెట్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. చెన్నై, కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 16 జట్లు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల నుంచి సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గడచిన మూడేళ్లుగా కరోనా మహమ్మారి వల్ల నిలిపివేశామని, తిరిగి ఈ ఏడాది నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే జట్లకు వసతి సౌకర్యంతో పాటు భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు ప్రథమ బహుమతిగా రూ.3 లక్షలతో పాటు శ్రీ భ్రమర సంక్రాంతి కప్ అందిస్తామన్నారు. ద్వితీయ బహుమతిగా రూ.2 లక్షలతో పాటు షీల్డ్, తృతీయ బహుమతిగా రూ.1 లక్షతో పాటు షీల్డ్‌ను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాటర్, బెస్ట్ ఫీల్డర్లకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని చెప్పారు. 9వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్న పోటీలకు ముఖ్య అతిథులుగా భారత బ్యాడ్మింటన్ సమాఖ్య మాజీ కార్యదర్శి కరణం చెంచుపున్నయ్య చౌదరి, ప్రముఖ సినీ నటుడు యర్రా రఘుబాబు, టోర్నమెంట్ ప్రారంభకులుగా గళ్లా రామచంద్రరావు (చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీభ్రమర టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్), గౌరవ అతిథులుగా డాక్టర్ బి.జవహర్, ఎన్.మోహన్‌దాస్ పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



తుది మెరుగులు దిద్దుకుంటున్న పిచ్

గుంటూరు రేంజ్‌లో 16 మంది సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
బి.అశోక్‌కుమార్	చిలకలూరిపేట రూరల్ సర్కిల్	నెల్లూరు 1 టౌన్ పీఎస్
వి.శ్రీనివాసరెడ్డి	ఒంగోలు రూరల్ సర్కిల్ (ప్రకాశం జిల్లా)	నాయుడుపేట పీఎస్ (తిరుపతి జిల్లా)
కె.నరసింహారావు	నాయుడుపేట పీఎస్ (తిరుపతి జిల్లా)	సంతమాగలూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)
బి.ప్రభాకర్	సంతమాగులూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)	రేంజ్ వీఆర్, గుంటూరు
ఎ.రాజామోహన్‌రావు	టి.చుండూరు సర్కిల్ (బాపట్ల జిల్లా)	ఒంగోలు రూరల్ సర్కిల్ (ప్రకాశం జిల్లా)
డి.జగన్‌మోహన్‌రావు	రేంజ్ వీఆర్	నాయుడుపేట సర్కిల్ (తిరుపతి జిల్లా)
వై.వీరాసోమయ్య	నాయుడుపేట సర్కిల్ (తిరుపతి జిల్లా)	రేంజ్ వీఆర్, గుంటూరు
జి.దశరథరామయ్య	రేంజ్ వీఆర్, గుంటూరు	తెనాలి 1 టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా
కె.చంద్రశేఖర్	తెనాలి 1 టౌన్ పీఎస్ గుంటూరు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
ఖాజా అల్తాజ్ హుస్సేన్	పొన్నూరు టౌన్ పీఎస్, గుంటూరు జిల్లా	నెల్లూరు 4 టౌన్ పీఎస్
బి.వి.వి.సుబ్బారావు	నెల్లూరు 4 టౌన్ పీఎస్	రేంజ్ వీఆర్, గుంటూరు
సి.కృష్ణారెడ్డి	కమాండ్ కంట్రోల్ సెంటర్, తిరుపతి జిల్లా	నరసరావుపేట 1 టౌన్ పీఎస్
ఎ.అశోక్‌కుమార్	నరసరావుపేట 1 టౌన్ పీఎస్, పల్నాడు జిల్లా	డీసీఆర్‌బీ, పల్నాడు జిల్లా
ఎస్.నాగమల్లేశ్వరరావు	డీసీఆర్‌బీ, పల్నాడు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
యు.శోభన్‌బాబు	ట్రాఫిక్ పీఎస్, పల్నాడు జిల్లా	డీటీఆర్‌బీ/ డీటీసీ, పల్నాడు జిల్లా
టి.విజయకృష్ణ	డీటీఆర్‌బీ/ డీటీసీ, పల్నాడు జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు

మహానుభావులు నడయాడిన నేల అద్దంకి

- తరువోజ పద్య శాసనం ఇక్కడ పుట్టడం గొప్ప విషయం
- జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న నటుడు తనికెళ్ల భరణి



భరణిని సన్మానిస్తున్న పుట్టంరాజు బుల్లెయ్య చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

అద్దంకి: చారిత్రక ప్రసిద్ధి చెందిన అద్దంకి మహానుభావులు నడయాడిన గడ్డ.. ఇక్కడ అణువణువు ఆ శివలింగ స్వరూపమేనని సినీ నటుడు, రచయిత, బహుముఖ ప్రజ్ఞాశాలి తనికెళ్ల భరణి పేర్కొన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జీవిత సాఫల్య పురస్కార సభకు భరణి ముఖ్య అతిథిగా హాజరై అవార్డును అందుకున్నారు. పట్టణంలోని కామేపల్లి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సభకు డి.వి.ఎం. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. శ్రీరామచంద్రమూర్తి కుమారుడు తాండవ కృష్ణ స్వాగతం పలికారు. తనికెళ్ల భరణి నటన గురించి వారణాశి రఘురామశర్మ, ఆర్.వి. రాఘవరావు సభకు పరిచయం చేశారు. వీరవల్లి సుబ్బారావు, జమ్మలమడక హనుమంతరావు అభినందనలు తెలిపారు. తనికెళ్ల భరణి మాట్లాడుతూ భాష, ప్రాంతం, సాహిత్యం మీద మక్కువ కలిగిన అద్దంకి రావడం తనకు ఆత్మీయుల్ని కలుసుకున్నంత ఆనందంగా ఉందని తెలిపారు. లక్షలు కాదు.. ఆత్మీయత, అభిమానం కావాలని, అందుకే అద్దంకికి ఇష్టంగా వచ్చానని చెప్పారు. చారిత్రకంగా గొప్పదైన అద్దంకిలో తరువోజ పద్య శాసనం పుట్టడం గొప్ప విషయం అన్నారు.

గూండా అవుదాం అనుకున్నా..

భరణి సభికుల నుంచి ప్రశ్నలు అడిగి.. జవాబు చెప్పే పద్ధతిలో సాగిన ప్రసంగం అహూతుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. గూండాను అవుదాం అనుకుని, రాంగ్ రూట్‌లో నడుస్తున్న తనను రాళ్లపల్లి నీవు నడవాల్సిన బాట ఇదిరా అని చెప్పాడన్నారు. అప్పటినుంచి ఈ బాటలో నడుస్తున్నానని తెలిపారు. దేవుడు కోరికలు తీర్చడని, వాటిని తీర్చుకునే ధైర్యాన్ని ఇస్తాడన్నారు. సినిమాల గురించి చెబుతూ కళాత్మకంగా సినిమా తీయడం చాలా కష్టమన్నారు. అందునా మిథునం వంటి సినిమా తీయడానికి మంచి నిర్మాత అవసరమని తెలిపారు. కథా రచయితలు లేరా అని అడిగిన ప్రశ్నకు లేకేం.. చాలా మంది ఉన్నారు. కాకపోతే జీవితానికి పనికివచ్చే కథను రాసే వారు లేరన్నారు. రాసే అవకాశం ఇచ్చే వారు లేరన్నారు. స్ఫూర్తినిచ్చే అంశం గురించి చెప్తూ కళాసాగర్ నాటక సంస్థను స్థాపించి దాని ద్వారా రాసిన 'గ్రహణం' నాటకంలో నటనను ఆచార్య ఆత్రేయ చూశాడని చెప్పారు. అప్పుడు ఆయన నేను నాటకం రాస్తాను.. రాస్తాను అని ఇన్నాళ్లు చెప్పాను. ఇక నేను రాయను.. తనికెళ్ల భరణి రాస్తాడని చెప్పాడని తెలిపారు. అప్పుడే ఆయన పాట రాసి తెచ్చుకున్న రూ.500 పారితోషికం తనకు ఇచ్చాడన్నారు. వాటిలో నాలుగు వందలు వాడేసుకుని ఒక వంద పైన ఆత్రేయ పేరు రాసి అలాగే పెట్టుకొన్నానని భరణి గుర్తు చేసుకున్నారు. నేటి సినిమాలో ప్రేక్షకుల బలహీనతలను క్యాష్ చేసుకోడమే ఎక్కువగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నేడూ మంచి సినిమాలు వస్తున్నాయని వాటిని తప్పకుండా చూడాలని ప్రేక్షకుల్ని కోరారు. ఇంట్లో ఇల్లాలు లేనప్పుడు వంట చేయడం చాలా ఇష్టమన్నారు. తాను పాడి రికార్డు చేసి ప్రసిద్ధి గాంచిన 'ఆటగదరా శివా, ఈ జన్మకింతేనా మల్లన్నా, నాలోన శివుడు గలడు' పాటలు పాడి వినిపించారు. చివరగా ట్రస్ట్ ఆధ్వర్యంలో భరణిని ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. సభలో రిటైర్డ్ ఆర్జేడీ యు. దేవపాలన, లేవీ ప్రసాద్, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

మైనర్ బాలికపై లైంగిక వేధింపులు

అద్దంకి రూరల్: మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై ఆదివారం ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఎస్సై కథనం ప్రకారం.. అద్దంకి పట్టణంలోని సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న చెన్నుపల్లి రామారావు అనే వ్యక్తి ఇంటి పక్కనే ఉంటున్న మైనర్ బాలికను వేధించసాగాడు. ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు రామారావుపై ఎస్సై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని బసవతారకరామ నగర్ రెండవ లైనుకు చెందిన దండిబోయిన ప్రసాద్ (44) చిలకలూరిపేట నుంచి గుంటూరుకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో లాలుపురం సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ప్రసాద్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

13న మాచర్లలో 'మనం పాడుదాం'

మాచర్ల: సంక్రాంతిని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో జనవరి 13వ తేదీన తెలుగు రాష్ట్రాల స్థాయి 'మనం పాడుదాం' పాటల పోటీలు నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ సాంస్కృతిక జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ కమలాసనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఉమ్మడి రాష్ట్రంలోని గాయనీ గాయకులను ప్రోత్సహించేందుకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మాచర్ల పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. తొలుత ఉదయం 10 గంటలకు పాటలు పాడే వారికి టెస్టు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సాయంత్రం తుది పాటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివరాలకు 9441065681ను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు



ఎంపీ మోపిదేవి వెంకట రమణారావును సత్కరిస్తున్న వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, ఆయన సోదరుడు అమృతపాణి

రేపల్లె రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీలు పెట్టే ప్రలోభాలకు తలొగ్గరాదని చెప్పారు. రాష్ట్రంలో రెండోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికవ్వటం తథ్యమన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ, మార్కెట్ యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మోపిదేవిని కలిసిన పలువురు నాయకులు

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావును ఆదివారం ఆయన నివాసంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు, నందికొట్కూర్ మాజీ ఎమ్మెల్యే ఎల్.వెంకట్ స్వామిలు కలిసి మోపిదేవిని సత్కరించారు.

ఎంపీ మోపిదేవి ఆర్థికసాయం

మండలంలోని బేతపూడి గ్రామ సర్పంచ్ ఆలూరి పద్మ కుమారుడు ఆలూరి రవి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు రవి వైద్యశాల ఖర్చులకై రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ రవి కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు.

యువత భవితకు వారధులు తల్లిదండ్రులే

యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న



ప్రద్యుమ్నను సత్కరిస్తున్న యువజన సర్వీసుల కమిషనర్ శారదాదేవి

తాడేపల్లిరూరల్ : యువతను పెడదారి పట్టకుండా సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని యువజన సర్వీసుల ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ యువతకు సరైన దిశా నిర్దేశం చేయడానికి స్వామి వివేకానంద లాంటి ఆధ్యాత్మిక గురువులు అవసరమన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న యువజన ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన యువజన బృందాలు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరమన్నారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచిన యువతీ యువకులను ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సుల ద్వారా మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు పంపిస్తామని అన్నారు. జిజ్ఞాస ఫౌండేషన్ డైరెక్టర్ భార్గవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యువజన ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని అన్నారు. యువతీ యువకులకు పోటీలతో పాటు సమ్మిట్లను, అవగాహనా సదస్సులను నిర్వహిస్తున్నామని చెప్పారు.

రానున్న కాలంలో యువతీ యువకులు స్టార్టప్‌లుగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి అనేకమందికి ఉద్యోగాలను ఇచ్చే స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.వి. రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ స్వామి, వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సి.హెచ్. హనుమంతరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ జట్టు ఎంపిక



పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కాలర్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ఆదివారం జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ సీనియర్ సెలెక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇక్కడ గెలుపొందిన జిల్లా స్థాయిలో గెలుపొందిన టీం రాష్ట్రస్థాయిలో ఆడే అవకాశం ఉంటుందని జిల్లా సెలెక్షన్ సెక్రటరీ కోటేశ్వరరావు అన్నారు. సెలెక్షన్ అయిన క్రీడాకారులకు స్కాలర్ డిగ్రీ కాలేజీ తరపున, పల్నాడు సెలెక్షన్ సెక్రటరీ కోటేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవుల జనార్దన్, పీఈటీ ఎం.వెంకట్రావు, ఎం.సంతోష్ చంటి పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

- జూదం జీవితాలను నాశనం చేస్తుంది
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

బాపట్లటౌన్: కోడిపందేలు.. పేకాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందేలు, జూదం, మట్కా వంటి వాటి వలన అనేక మంది సులభంగా వచ్చే అధిక డబ్బులకు ఆశపడి పందేలు కాసి వారి ధనాన్ని నష్టపోతున్నారన్నారు. జిల్లాలో ఎక్కడ కోడిపందేలు, జూదం నిర్వహించకుండా ఉండేందుకు గతంలో వీటిని నిర్వహిస్తూ, ఆడుతూ పట్టుబడిన వారు మళ్లీ వాటి జోలికి వెళ్లకుండా బైండోవర్ చేయడం జరుగుతుందన్నారు. గతంలో కోడిపందేలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎవరైనా జిల్లాలో కోడిపందేలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములిచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువకులు జూదం అనే వ్యసనానికి బానిసలై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. జూదంలో కోల్పోయిన డబ్బులను సంపాదించడానికి చిన్నచిన్న దొంగతనాలు చేయడానికి సైతం వెనుకాడట్లేదన్నారు. శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోమన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ, డయల్ 100, 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మృత్యుంజయరావుకు జీవితకాల సాఫల్య పురస్కారం

హాజరైన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ రాజశేఖర్



మృత్యుంజయరావు దంపతులకు జీవితకాల సాఫల్య పురస్కారం అందజేస్తున్న వీసీ

తెనాలి: నాలుగు పీజీలు, మరికొన్ని డిగ్రీలను పూర్తిచేసి ఆరు పదుల వయసులోనూ నిత్య విద్యార్థిగా యూనివర్శిటీలో సంగీత విద్యను అభ్యసిస్తున్న సామాజిక సేవకుడు మొవ్వా మృత్యుంజయరావును తమ యూనివర్శిటీ బ్రాండ్ అంబాసిడర్‌గా భావిస్తున్నానని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల గ్రామం మూల్పూరుకు చెందిన మొవ్వా మృత్యుంజయరావు న్యాయవాద కోర్సుతో సహా పలు డిగ్రీలు, నాలుగు పీజీలు పూర్తి చేశారు. ప్రస్తుతం నాగార్జున యూనివర్శిటీలో సంగీత పాఠాలను అభ్యసిస్తున్నారు. గుంటూరు కేంద్రంగా మొవ్వాస్ ఎడ్యుకేషనల్ ఎంకరేజ్‌మెంట్ ట్రస్ట్‌ను స్థాపించి, అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు, మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు నగదు పురస్కారాలను పంపిణీ చేస్తున్నారు. పేదలను ఆదుకోవటం, జిల్లా కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చే నిరక్షరాస్యులకు దరఖాస్తులు పూర్తిచేసివ్వటం, నెలకు 20 రోజుల పాటు ఏదో ఒక బ్యాంకులో ఖాతాదారులకు ఉచిత కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నారు. వీరి సేవలకు గుర్తింపుగా పట్టణానికి చెందిన తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో మృత్యుంజయరావుకు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని బహూకరించారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆరుపదుల వయసు దాటినా ఇంకా పలు పీజీలు, డిగ్రీలు చేస్తూ సంగీతవిద్యను అభ్యసిస్తున్న మృత్యుంజయరావు నేటి యువతకు మార్గదర్శకులని చెప్పారు. ఆయనకు ఇచ్చిన అవార్డు యూనివర్శిటీకి ఇచ్చినట్టుగా భావిస్తున్నానని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ తన ప్రసంగంలో యూనివర్శిటీలో సంగీత విద్యను అభ్యసిస్తున్న తనకు మృత్యుంజయరావుతో అనుబంధం ఏర్పడిందన్నారు. నిస్వార్థంగా ఆయన అందిస్తున్న సమాజసేవను, నిరక్షరాస్యులకు తోడ్పడుతున్న తీరును వివరించారు. సభలో జేసీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకరబాబు, యూనివర్శిటీ ఫెర్మార్మింగ్ అండ్ ఫైన్ ఆర్ట్స్ డీన్ డాక్టర్ జి.అనిత, విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ ఎస్.రఘుకుమార్, చింతలపాటి మంజుల, గల్లా మధుసూదనకుమార్ తమ ప్రసంగాల్లో మృత్యుంజయరావు సేవానిరతిని అభినందించారు.

విద్యార్థులు సంకల్ప బలంతో ముందుకు సాగాలి



జాస్తి వెంకటేశ్వర్లు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిమ్మగడ్డ

గుంటూరు ఎడ్యుకేషన్: కృషి, పట్టుదలతో విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం జేకేసీ కళాశాలరోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 299 మంది విద్యార్థులకు రూ.49 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలనే కసి ఉండాలని, అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె. బసవపున్నయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు కొంత వరకైనా సహాయం అందించాలనే ఆశయంతో 2003లో స్థాపించిన కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ప్రతి ఏటా పెద్ద ఎత్తున ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థుల చదువుల కోసం సహృదయం కలిగిన దాతలు ఇస్తున్న విరాళాలతో ప్రతి ఏటా ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో మరింతగా ముందుకు తీసుకువెళతామని చెప్పారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికీ రూ.17వేలు చొప్పున 299 మంది విద్యార్థులకు రూ.49 లక్షల ఉపకార వేతనాలను చెక్కుల రూపంలో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు నామినేని కోటేశ్వరరావు, జి. గోవర్ధనరావు, నన్నపనేని సదాశివరావు, జాస్తి కృష్ణకుమారి, మద్దినేని గోపాలకృష్ణ పాల్గొన్నారు.


చెకుముకి పోటీలో 'జవహర్' సత్తా



బహుమతులు సాధించిన టీంలతో జేవీవీ సభ్యులు

చిలకలూరిపేటటౌన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు సైన్స్ సంబంధిత విషయాలపై జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 40 టీంలు హాజరయ్యాయి. ప్రభుత్వ పాఠశాల విభాగంలో మండలంలోని జవహర్ నవోదయ విద్యాలయ టీం మొదటి బహుమతి, ఏపీ మోడల్ స్కూల్(నూజెండ్ల) రెండో బహుమతి, ఏపీ మోడల్ స్కూల్(వినుకొండ) తృతీయ బహుమతి సాధించాయి. ప్రైవేటు పాఠశాల విభాగంలో రెంటచింతల వివేకానంద టెక్నో స్కూల్ ప్రథమ బహుమతి, నరసరావుపేట ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ద్వితీయ బహుమతి, గురజాలకు చెందిన అక్షరా స్కూల్ తృతీయ బహుమతి సాధించాయి. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఫిబ్రవరి 10,11 తేదీలలో చిలకలూరిపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, కార్యదర్శి జేవీకేఎస్ ప్రసాద్, కోశాధికారి చలపతిరావు, రమేష్, ఆయేషా సుల్తానా, కె శ్రీనివాసరెడ్డి, ప్రతాపరెడ్డి, సీహెచ్ ప్రభాకరరెడ్డి, బెల్లంకొండ వీరాంజనేయులు, డాక్టర్ పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీ భ్రమర టౌన్ షిప్స్ ప్రాజెక్టు బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరించిన చైర్మన్ రామచంద్రరావు

పాత గుంటూరు: మూస పద్ధతిలో కొనసాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంలో సమూలమైన మార్పులు చేపట్టి వినూత్న ఆలోచనలు, అద్భుత వెంచర్లతో గృహ నిర్మాణ రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ ప్రైవేట్ లిమి టెడ్ సంస్థ బాపట్ల బీచ్ ఎదురుగా 'అలోహ బీచ్ రిసార్ట్' పేరుతో ఒక విలాసవంతమైన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా గుంటూరు వెల్‌కమ్ హోటల్‌లో ఘనంగా బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించా రు. ఈ ప్రీ-లాంచ్ కార్యక్రమాన్ని భ్రమర హౌసింగ్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు ప్రారంభించగా, సంస్థ డైరెక్టర్లు మారం చంద్ర శేఖర్, ఎం.ఎస్ రాజు, ఎంపికె లక్ష్మీపతి రాజు, కోట శైలారెడ్డి, యడ్లపల్లి మురళీకృష్ణ, రావెల గోపాలకృష్ణ పాల్గొన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న ప్రస్తుత సమాజానికి విలాసవంతమైన జీవన శైలిని అందించడానికి రియాల్టీ, నిర్మాణ రంగాల్లో అత్యాధునిక పోకడలతో శరవేగంగా దూసుకుపోతున్న శ్రీ భ్రమర చేపట్టిన అద్భుతమైన ప్రాజెక్టు 'అలోహ బీచ్ రిసార్ట్'.. వెడ్డింగ్ డెస్టినేషన్, కార్పొరేట్ మీట్స్, ఫ్యామిలీ హాలిడేస్ ట్రిప్‌కు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. థీమ్ పార్క్, వాటర్ స్పోర్ట్స్, ఫుడ్ కోర్ట్, బీచ్ ఫ్రంట్ హోటల్, హార్స్ రైడింగ్, బీచ్ వాలీబాల్, కిడ్స్ ప్లే జోన్ వంటి ఎన్నో సదుపాయాలు కలిగిన ఈ బీచ్ రిసార్ట్‌లో బీచ్ ఫ్రంట్ ప్లాట్స్, కాటేజెస్, విల్లాస్ వినియోగదారులకు అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. కార్యక్రమంలో చెన్నంశెట్టి సతీష్ బాబు, కల్వకోట సాయి శంకర్, సీనియర్ మార్కెటింగ్ మేనేజర్లు, మార్కెటింగ్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

పిడుగురాళ్ల: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ మహిళ ప్రియుడి చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని పాతగణేశునిపాడులో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. పిడుగురాళ్ల పట్టణంలోని మేదర బజారుకు చెందిన వజ్రగిరి పాపులమ్మ అలియాస్ జ్యోతి(35), పాతగణేశునిపాడులోని ఎస్టీ కాలనీకి చెందిన ఢీకొండ కిరణ్‌కుమార్ వంట మాస్టర్‌గా స్థానిక ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. ఆమె భర్త గతంలో చనిపోయాడు. కిరణ్‌కుమార్ భార్య నాలుగేళ్ల క్రితం లివర్ క్యాన్సర్‌తో చనిపోయింది. దీంతో ఇద్దరు సహజీవనం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మృతురాలు వజ్రగిరి పాపులమ్మకు అంతకుముందు నాగరాజు అనే వ్యక్తితో పరిచయం ఉండ డంతో అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయంపై తరచూ గొడవ పడుతున్నారు. ఈ నెల 6వ తేదీ పాపులమ్మ, కిరణ్‌కుమార్‌తో కలసి పాతగణేశునిపాడులోని కిరణ్‌కుమార్ ఇంటికి వెళ్లింది. కిరణ్‌కుమార్, పాపులమ్మకు నాగరాజు విషయమై గొడవ జరిగింది. ఈ గొడవ ఆగ్రహానికి దారి తీసి కిరణ్‌కుమార్ అక్కడే ఉన్న రోకలి బండతో పాపులమ్మ తల మీద బలంగా కొట్టడంతో ఆమె అక్కడిక్కడే చనిపోయింది. దీంతో నిందితుడు కిరణ్‌కుమార్ పారిపోయాడు. ఆదివారం మృతురాలి పాపులమ్మ చెల్లెలు రాణి మృతురాలికి ఫోన్ చేస్తుండగా రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయకపోవటంతో అనుమానం వచ్చి పాతగణేశునిపాడు వచ్చి చూసింది. దీంతో రక్తపు మడుగులో పాపులమ్మ చనిపోయి ఉండటంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించింది. గురజాల డీఎస్పీ పల్లపు రాజు, పట్టణ సీఐ జీవీ ఆంజనేయులుతో పాటు ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ వివరాలను తెలుసుకున్నారు.

భార్యను హతమార్చిన భర్త

- కారెంపూడి తండాలో దారుణం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ పల్లపు రాజు



దేవిబాయి మృతదేహం




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ పల్లపు రాజు, సీఐ జయ కుమార్, ఎస్ఐ రామాంజనేయులు

కారెంపూడి: భార్యను చేతులు కట్టేసి నీటి రమ్ములో ముంచి హత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. కారెంపూడి తండాకు చెందిన రమావతు బర్మానాయక్, దేవిబాయి(34) భార్యాభర్తలు. 17 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దేవిబాయి మేనమామ కుమార్తె. వీరికి ముగ్గురు పిల్లలు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. బర్మానాయక్ ప్రస్తుతం 4 ఎకరాలలో మిర్చి పంట సాగు చేస్తున్నాడు. కల్లంలో ఉన్న మిరప కాయలకు కాపలాకు రాత్రి 9 గంటలకు భార్యాభర్తలు పొలం వెళ్లారు. అక్కడే భార్య చేతులు కట్టేసి నీటి రమ్ములో ముంచి హత్య చేసినట్లు గుర్తించారు. బర్మానాయక్‌కు వివాహేతర సంబంధాలున్నాయని ఈ నేపథ్యంలోనే భార్యభర్తల మధ్య జరిగిన గొడవలో భార్యను హతమార్చాడని భావిస్తున్నారు. దానితో పాటు తన మామ బాబూనాయక్ తాయెత్తులు వేస్తాడని తన కుటుంబానికి చేతబడి చేయించాడని అందుకే హత్యకు పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం. మొదట తనతో పాటు తన తల్లిదండ్రులు కూడా హత్యలో పాల్గొన్నారని పోలీసులకు చెప్పుకొచ్చాడు. మృతురాలి తండ్రి బాబూనాయక్, బర్మానాయక్ తల్లి శామినిబాయి అక్కాతమ్ముళ్లు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ పల్లపు రాజు పరిశీలించారు. ఆయన వెంట సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చని కాపురాన్ని కూల్చుకున్నాడు..

భార్యాభర్తలు కష్టపడి పని చేసుకుంటున్నారు. నాలుగెకరాలలో మిర్చి వేశారు. మిర్చి కూడా బాగుంది. 70 క్వింటాళ్ల వరకు మిరప కాయలు అయ్యేలా ఉన్నాయి. ముగ్గురు పిల్లలు బాగా చదువుకుంటున్నారు. ఈ దశలో మద్యం మత్తులో పుట్టిన దుర్బుద్ధితో కట్టుకున్న భార్యనే హత్యచేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కారెంపూడి తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు శామనిబీయి, లాలూనాయక్ దంపతులు కూడా బాగా కష్టపడి పనిచేసి పంటలు బాగా పండిస్తారనే పేరుంది.

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



తాళ్లచెరువులో మాట్లాడుతున్న కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి

అచ్చంపేట: రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర సమాచార ప్రజా సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాళ్ల చెరువు గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. విజయకుమార్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, సర్పంచి కిక్కుర్రు అర్లారెడ్డి, మాజీ సర్పంచి తుమ్మా చిన్నపరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ బాలశౌర్రెడ్డి, రైతు నాయకుడు లూర్దుమ రెడ్డి పాల్గొన్నారు.